క్లుప్తంగా

నేడు వధూవరులుగా భీమేశ్వరుడు, అమ్మవార్లకు అలంకారం



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో అయ్యావారిని, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించనున్నారు. ఈనెల 24వ తేదీ సోమవారం స్వామి వారి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఉదయం 10.05 నిమిషాలకు ఉత్సవ మూర్తులను వధూవరులుగా తీర్చిదిద్దేందుకు పండితులు మూహూర్తం నిర్ణయించినట్టు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. సోమవారం రాత్రి 9.05 నిమిషాలకు కల్యాణం జరుగుతుందని చెప్పారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్ని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకున్న అమ్మవారు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమం నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మాతృభాష గొప్పతనం మరువలేనిది



కార్యక్రమంలో మాట్లాడుతున్న సాయిరామకృష్ణ

సామర్లకోట: మాతృభాష గొప్పతనం ఎన్నటికీ మరువలేనిదని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులందరూ మాతృభాష గొప్పతనాన్ని గుర్తించి దానిలో ప్రావీణ్యం సాధించాలన్నారు. తెలుగు భాషా ఉపాధ్యా యులు బి.శ్రీలక్ష్మి, బి.బేబీరాణి తదితరులు మాతృభాష ప్రాధాన్యాన్ని వివరించారు.

ఎంఎస్ ఆఫీస్‌పై శిక్షణ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకేలో బోధనేతర సిబ్బందికి రెండు రోజుల పాటు నిర్వహించే ఎంఎస్ ఆఫీస్ శిక్షణ శిబిరాన్ని వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ శుక్రవారం ప్రిన్సిపాల్ పరిపాలన కార్యాలయం ఎదుట ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతర అభ్యసన ద్వారా జ్ఞానం పెరుగుతూ ఉంటుందని, ఏదైనా ఒక సంస్థకు డేటా ముఖ్యమన్నారు. కింది స్థాయి సిబ్బంది డేటా సక్రమంగా నిర్వహిస్తే ఆ సంస్థ విజయవంతంగా ముందంజలో ఉంటుదన్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో సమాచార నిర్వహణ అంతా డిజిటలైజేషన్ అవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, ఎఫ్‌డీసీ డైరెక్టర్ సుబ్బారావు, సిన్‌టాక్స్ సెల్స్‌హెడ్ ఎం.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాధార నేలలైన మెట్టలో ఒకప్పుడు అక్కడక్కడా తప్పితే వరి పొలాలు కనపడేవి కావు. వాన పడితేనే సేద్యం లేకుంటే పస్తే అన్నట్టు ఉండేది. ఆ క్రమంలో నేలతల్లినే నమ్ముకున్న రైతన్న వాణిజ్య పంటలవైపు దృష్టి సారించి వచ్చిన ఆదాయంతో సంతృప్తి పడేవాడు. నేడు ఆ పరిస్థితి లేదు. తన నేలను ఇంకెలా నాణ్యంగా తీర్చిదిద్దుకోవాలి.. ఉన్న దానిలో అదనపు ఆదాయం ఎలా పొందాలి అనే ఆలోచనలు ఫలించి నేడు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాడు. నీరుంటేనే నారు అనే పరిస్థితి నుంచి నేడు తన పంటలో అంతర పంటగా పుష్ప జాతులను సాగుచేస్తూ ముందుకు సాగిపోతున్నాడు. వానొస్తే తడిసి.. ఎండొస్తే ఎండిన మెట్ట నేలలు నేడు సుమ సోయగాన్ని సంతరించుకుంటున్నాయి. ఒకరి నుంచి మరొకరు చైతన్య వంతులై అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు.



కనకాంబరం తోట పనిలో రైతు



కొబ్బరి తోటలో అంతర పంటగా చామంతి సాగు

మెట్టాయెనోయ్.. కుసుమ కోమలం..



విరగబూసిన చామంతి తోట

- ప్రకృతి సాగుతో పుష్ప వికాసం
- మెట్టలో గుత్తులు గుత్తులుగా పూలు
- నియోజకవర్గంలో పెరిగిన సాగు
- అంతర పంటలతో అదనపు ఆదాయం
- సహకరిస్తున్న అధికారులు
- లాభాల బాటలో రైతన్నలు

పిఠాపురం: ఒకప్పుడు పూల సాగు అంటే కడియం పేరు మాత్రమే వినిపించేది. కానీ నేడు పలు చోట్ల పూల సాగు ప్రారంభించారు. ఎక్కువగా మెట్ట ప్రాంతాలైన పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో పూదోటల సాగు ఊపందుకుంది. ఎక్కువగా సేంద్రియ పద్ధతిలో పూల తోటలు సాగు చేస్తున్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ, తాటిపర్తి, చెందుర్తి, కొడవలి తదితర ప్రాంతాల్లోని పూదోటల సోయగాలు మనసు దోచుకుంటాయి. అటుగా వెళ్లే ప్రతి ప్రయాణికుడి సెల్‌ఫోన్ ఆ సోయగాలను బంధించకుండా ఉండదంటే అతిశయోక్తి కాదేమో. ప్రకృతి వ్యవసాయానికి పెట్టింది పేరైన గొల్లప్రోలు మండలంలో ఇప్పుడు పూల తోటలు పవరశింప చేస్తున్నాయి. సాధారణంగా పంట పొలాల పచ్చదనాన్ని చూడడంతోనే మనసు ఎంతో తేలికవుతుంది. ప్రకృతి వ్యవసాయంలో దుర్గాడ రైతులు విభిన్న పంటలు సాగు చేస్తుండగా ప్రస్తుతం కనకాంబరం, చామంతి, బంతి తోటలు సాగు చేసి లాభాలు అర్జిస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 20 హెక్టార్లలో పూల తోటల సాగు చేస్తున్నారు.

అంతర పంటగా..

ఎక్కువ మంది రైతులు తమ పొలాల్లో ఉన్న కొబ్బరి, పామాయిల్ వంటి తోటల్లో అంతర పంటలుగా పూల పెంపకం చేపట్టారు. ప్రధాన తోటలు కోత దశకు చేరుకునే వరకు ఈ అంతర పంటలు ఆదాయాన్ని ఇస్తుండడంతో పెట్టుబడికి ఇబ్బంది లేకుండా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎక్కువగా కొబ్బరి తోటల్లో వివిధ రకాల పూల తోటల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.



అంతర పంటగా సాగు చేసిన కనకాంబరం తోట

సేంద్రియ విధానంతో పెట్టుబడి తగ్గింది

కొన్నేళ్లుగా పూల తోటల సాగు ప్రారంభించినా తెగుళ్ల పురుగు దాడితో అంతగా ఆదాయం వచ్చేది కాదు. రెండేళ్లుగా సేంద్రియ విధానంలో సాగు చేయడం వల్ల చాలా వరకు పెట్టుబడి తగ్గింది. మా కొబ్బరి తోటలో అంతర పంటగా కనకాంబరం, చామంతి, బంతి తోటలను రెండు దఫాలుగా వేశాను. ఒకటి వేసి అది కోత దశకు చేరుకున్నాక మరో కొంత భూమిలో రెండో దఫా వేస్తుంటాను. ఇలా ఒక దాని తరువాత ఒకటి పంట నిరంతరం చేతికి వస్తుంది. ఇలా ఏడాది పొడవునా పంటలు చేతికి వచ్చేలా సాగు చేస్తుంటాను. ప్రస్తుతం కొబ్బరి తోట ఇంకా అందుబాటులోకి రాలేదు కేవలం పూల తోటల సాగు ద్వారానే ఆదాయం వస్తోంది. దానితోనే కొబ్బరి తోటకు పెట్టుబడి పెడుతూ ఇతర పంటలు సాగు చేసుకుంటున్నాను. పూలకు మంచి గిరాకీ ఉంది. ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి పూలను కొనుగోలు చేసి తీసుకు వెళుతున్నారు.

– కుమ్మరి సత్యనారాయణ, రైతు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం

పూదోటలకు ప్రాధాన్యం ఇస్తున్నారు

మా మండలంలో గతంలో కంటే ఎక్కువ మంది పూల తోటల సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వంద శాతం సేంద్రియ పద్ధతులే పాటిస్తున్నారు. మేము కూడా వారికి పూర్తి సహకారం అందిస్తున్నాం. జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ ద్వారా డీపీఎం ఎలియాజరు ప్రత్యేక శ్రద్ధ చూపి సాగుకు సహకరిస్తున్నారు. దీంతో రైతులు ఎక్కువ మంది పూల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. గ్రామంలో ఇళ్ల వద్ద పూల తోటల పెంపకం పెరిగింది. ప్రతి ఇంటి పెరట్లో పూల పెంపకానికి ఆసక్తి చూపేలా ప్రోత్సహిస్తున్నాం.

– గుండ్ర శివచక్రం, గో గాయత్రి ప్రకృతి వ్యవసాయ వనరుల తయారీ శిక్షణ కేంద్రం, దుర్గాడ

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 27వ తేదీన జరిగే ఎన్నికకు సంబంధించి డివిజన్ వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 11 మండలాలకు 19,967 మంది పట్టభద్రుల ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉందన్నారు. ఆయా మండలాల్లో 31 పోలింగ్ కేంద్రాలకు ఏడు రూట్ల ద్వారా ఎన్నికల సిబ్బందిని ఆయా మండలాలకు తరలించేందుకు సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. వీరందరికి ఈ నెల 26వ తేదీన స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పోలింగ్ సామగ్రిని అందయనున్నట్టు తెలిపారు. 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందని, మార్చి మూడో తేదీన లెక్కింపు జరుగుతుందని శ్రీరమణి తెలిపారు.

ఏటీఎం కార్డు ఏమార్చి రూ.26 వేలు చోరీ

పిఠాపురం: ఏటీఎం సెంటర్‌లో డబ్బులు తీయడానికి ఇబ్బంది పడుతున్నట్లు నటించి తనకు డబ్బులు తీయడం రాదని, సాయం చేసిన వ్యక్తి దగ్గర ఏటీఎం కార్డును మార్చేసి డబ్బులు కాజేసాడు ఒక అగంతకుడు. స్థానిక స్టేట్ బ్యాంకు వద్ద గురువారం జరిగిన ఘటనకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక స్టేట్‌బ్యాంకు వద్ద ఉన్న ఏటీఎం సెంటర్ వద్దకు స్థానికుడు మాకినీడి త్రిమూర్తులు డబ్బులు డ్రా చేస్తున్నారు. ఇంతలో ఏటీఎం సెంటర్లోకి వచ్చిన ఓ వ్యక్తి తనకు డబ్బులు తీసుకోవడం రాదని డ్రాచేసి ఇవ్వాలని కోరాడు. ఈ క్రమంలో త్రిమూర్తులు తన కార్డును పక్కన పెట్టి అతని కార్డుతో డబ్బులు తీసే ప్రయత్నంలో ఉన్నాడు. ఇంతలో ఆ వ్యక్తి తన కార్డును త్రిమూర్తులు కార్డుతో మార్చేసి ఉడాయించాడు. తరువాత త్రిమూర్తులు తన కార్డుతో డబ్బులు తీసుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో అక్కడి సిబ్బంది కార్డు మారిపోయినట్టు గుర్తించారు. ఇంతలోనే అతని కార్డు నుంచి రూ.26 వేలు డ్రా అయినట్టు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన త్రిమూర్తులు వెంటనే పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చోరీలకు చెక్ ఏదీ?



సెల్‌ఫోన్ చోరీ కేసులో లభ్యమైన సీసీ ఫుటేజ్

- యథేచ్ఛగా సెల్‌ఫోన్, బైక్‌ల దొంగతనాలు
- పోలీసుల నిఘా వైఫల్యమేనంటున్న బాధితులు

పిఠాపురం: పట్టణంలో సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాల చోరీలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. ఈ ఘటనలపై పోలీసులు సరైన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. స్థానిక శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం ఆలయ వీధిలో ఒక మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు అగంతకులు బండిపై నుంచి కింద పడినట్లు నటించి సాయం చేయడానికి వచ్చిన వ్యక్తి నుంచి సెల్ ఫోన్ చోరీ చేసి పరారైన ఘటన పట్టణంలో సంచలనం రేపింది. అలాగే స్థానిక పల్లపువీధి రామకోవెల వద్ద పల్సర్‌బైక్‌పై వచ్చిన ఇద్దరు రూ.20 నోటు కింద పడేసి నోటు పడిపోయింది మీదే తీసుకోండి అంటు అక్కడే ఉన్న కె.శ్రీనివాస్ అనే వ్యక్తికి చెప్పగా ఆయన కిందకు వంగి చూసే లోపు సెల్ ఫోన్ లాక్కుని బండిపై పరారయ్యారు. మరో ఘటనలో రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూలు వద్ద ఇద్దరు దంపతులు ఆగి తమ బండికి గాలి కొట్టించుకుంటుండగా అక్కడకు వచ్చిన ఒక వ్యక్తి కింద రూ.10 నోటు పడింది మీదేనా అని వారిని ఏమార్చి వారి సెల్‌ఫోన్ లాక్కుని ఉడాయించే యత్నంలో స్థానికులు వారిని పట్టుకునేంతలో వారి పల్సర్‌పై తప్పించుకుని వేగంగా వెళ్లిపోయారు. అదే ప్రాంతంలో మరో వ్యక్తి వద్దకు పల్సర్ బండిపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు రూ.10 నోటు కిందపడేసే పాత ట్రిక్కు ఉపయోగించి అతని వద్ద సెలఫోన్ లాక్కుని పరారయ్యారు. అంతే కాదు ఫోన్ మాట్లాడుతూ నడిచి వెళుతున్న వారి నుంచీ ఫోన్లు లాక్కుని పారిపోతున్న ఘటనలు రోజుకు పదికి పైగా జరుగుతుండగా, బైక్‌ల చోరీలు రోజుకు మూడు వరకు జరుగుతున్నాయి. ఈ ఘటనలు కొన్ని సీసీ టీవీలో రికార్డు అయ్యాయి. బాధితులు పోలీసులను ఆశ్రయించినా ఫలితం ఉండడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని ఫిర్యాదులకు వారు కేసులు నమోదుచేయడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. స్థానికంగా రద్దీగా ఉండే ఉప్పాడ బస్టాండ్ సెంటర్, కోటగుమ్మం సెంటర్, చర్చి సెంటర్, సినిమా సెంటర్ ఇలా అన్ని చోట్లా ఇటువంటి చోరీలు జరుగుతున్నాయి.

దొంగలకు చెక్ పెడుతున్నాం

ఈ మధ్య కాలంలో చోరీలు, దోపిడీలు భారీగానే జరిగాయి. వీటన్నిటి పైనా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపస్తున్నాం. ఇప్పటికే పలువురు దొంగలను పట్టుకున్నాం. విచారణ జరుగతున్నందున వివరాలు బయటపెట్టలేం. పట్టణంలో సీసీ కెమెరాలు అన్నీ పని చేస్తున్నాయి. వాటి ఫుటేజీ ఆధారంగానే అన్ని కేసులు దర్యాప్తు చేస్తున్నాము. సెల్‌ఫోన్ దొంగతనాలపైనా విచారణ జరుగుతోంది. పట్టణంలో ప్రధాన సెంటర్లలో ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేస్తున్నాం.

– శ్రీనివాస్, సీఐ, పిఠాపురం

పశువుల అక్రమ రవాణా అడ్డగింపు

- 8 పశువులు, ఒక వాహనం స్వాధీనం
- ఇద్దరి అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న పశువులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి 16వ జాతీయ రహదారిపై పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని తనిఖీ చేసి 8 ఎద్దులు, ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం గురువారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో తమకు అందిన సమాచారం మేరకు చెందుర్తి జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఒక బొలెరోను తనిఖీ చేయగా అందులోని 8 ఎద్దులను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం పెదమనాపురానికి చెందిన వ్యాన్ డ్రైవర్ కర్నాటి విజయ్ కుమార్, గుడ్ల రమణ అనే ఇద్దరిని అదుపులోని తీసుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలు, రహదారి భద్రతపై అప్రమత్తం



విద్యార్థుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఐపీఎస్ అధికారి సుస్మిత



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై లలితాదేవి

ఐపీఎస్ అధికారి సుస్మిత

కాకినాడ రూరల్: సైబర్ నేరాలు, రహదారి భద్రతపై విద్యార్థులు, ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని 2023 సివిల్ సర్వీసెస్ బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఆర్.సుస్మిత తెలిపారు. శుక్రవారం స్థానిక ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో ప్రొబేషనరీ ట్రైనింగ్‌లో ఉన్న సుస్మిత ఇంటరాక్టివ్ సెషన్‌లో పాల్గొన్నారు. అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పోచయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుస్మిత మాట్లాడుతూ యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రయాణం గురించి మాట్లాడారు. తాను తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా కడలూరులోని ఓ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చానన్నారు. తన సోదరి సైతం ఆల్ ఇండియా సర్వీసెస్‌లో ఐఏఎస్ అధికారి అయినందుకు గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల నుంచి యుపీఎస్సీ సివిల్ సర్వీసెస్ సిద్ధం, సామాజిక సమస్యలు, ఇతర ప్రస్తుత అంశాలపై ఎన్నో ప్రశ్నలకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ సమగ్ర సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ డి.అజయ్ రతన్, డాక్టర్ నాని బాబు, డాక్టర్ గోపీ తదితరులు పాల్గొన్నారు.

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో..

అవగాహన లేమి, భయం, తడబాటు, బలహీన వ్యక్తిత్వం, అత్యాశ తదితర కారణాలతో సైబర్ నేరాలు రోజు రోజుకూ విపరీతంగా పెరిగిపోతున్నందున అప్రమత్తంగా ఉండాలని సర్పవరం ఎస్సై లలితా దేవి పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పట్టణాలకే పరిమితమైన సైబర్ నేరాలు నేడు గ్రామాలకీ వ్యాపించాయని, ఏదైనా సైబర్ నేరం జరిగితే బాధితులు వెంటనే 1930 టోల్ ఫ్రీ కి ఫోన్ చేయాలని, కొత్త నెంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చినా, మెసేజ్ వచ్చినా స్పందించవద్దని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఆధార్, ఫోన్, బ్యాంక్ అకౌంట్, ఏటీఎం తదితర సమాచారాన్ని ఎవరికీ షేర్ చేయవద్దన్నారు. పోలీసులమని చెప్పి భయపెడితే వారికి డబ్బులు పంపకుండా వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో లలితా దేవిని సత్కరించారు. కార్యక్రమంలో మహిళా సంక్షేమ అధికారి ఉష, మాజీ సైనికోద్యోగి ఎస్.శ్రీనగేష్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, పి.పార్థసారథి, రాజా తదితరులు పాల్గొన్నారు.

జన గణనతోనే కుల గణన

- త్వరలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అవగాహన ర్యాలీ
- ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు



జిల్లా అధ్యక్షుడు రమణకు నియామక పత్రం అందజేస్తున్న శంకరరావు

కాకినాడ రూరల్: జాతీయ స్థాయిలో ఈసారి జరిపే జన గణనతో పాటే కుల గణన జరపాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. కాకినాడలో నాగమల్లితోట జంక్షన్ వద్ద శుక్రవారం నిర్వహించిన బీసీ సంఘ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. కుల గణన చేపట్టాల్సిన ప్రాధాన్యతను కేంద్రానికి తెలిసేలా ఉద్యమాలు, కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. చట్ట సభలో బీసీలకు సరైన రిజర్వేషన్లు కల్పించాలన్నా, జస్టిస్ రోహిణి కమిషన్ సిఫారసుల మేరకు ఓబీసీల వర్గీకరణ జరపాలన్నా, మండల కమిషన్ సిఫారసులను సంపూర్ణంగా అమలు పరచాలన్నా బీసీ కుల గణన జరపవల్సి ఉందన్నారు. అనంతరం జిల్లా నూతన వర్గానికి నియామకపు పత్రాలు అందించారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా గుత్తుల రమణ నియమితులవ్వడంతో ఆయనతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులకు నియామకపు పత్రాలు అందించారు.

23న ప్రయాగరాజ్‌కు ఆర్టీసీ సర్వీసులు

కాకినాడ సిటీ: ఉత్తరప్రదేశ్ ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు కాకినాడ డిపో నుంచి ఈ నెల 23వ తేదీన స్టార్ లైనర్ నాన్ ఏసీ స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మనోహర్ శుక్రవారం తెలిపారు. ఈ బస్సుకు టికెట్ కావల్సిన భక్తులు ముందుగా అడ్వాన్స్ రిజర్వేషన్ చేయించుకోవచ్చన్నారు. ఈ బస్సులు కాకినాడ నుంచి బయలుదేరి భువనేశ్వర్, పూరి, కోణార్క్ మీదుగా ప్రయాగరాజ్ చేరుకుంటాయన్నారు. అక్కడ త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు చేసిన తరువాత తిరుగు ప్రయాణంలో అయోధ్య, వారణాసి, క్షేత్రాలు చూపించి తిరిగి ఏడు రోజుల అనంతరం కాకినాడ చేరుకుంటాయన్నారు. ఈ బస్సుకు టిఫిన్స్, భోజనాలతో సహా ఒక్కొక్క టికెట్‌కు రూ.12,200 ధర నిర్ణయించినట్లు డిపో మేనేజర్ తెలిపారు.

పాలకా.. పరిష్కరించవా..



వేంకటేశ్వస్వామి అలయం వద్ద పూడుకుపోయిన డ్రెయిన్



కొండెవరంలో వెంకటేశ్వస్వామి అలయం వద్ద పేరుకున్న చెత్త



పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో పారుతున్న మురుగునీరు

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ప్రజలు మొత్తుకుంటున్నా అధికారుల ఏమాత్రం స్పందించడం లేదు. గ్రామంలో ఎక్కడ చూసినా పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ప్రధాన రహదారులు, ఆలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద డ్రెయిన్లు పూడుకుపోయాయి. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గేటు పడితే గందరగోళమే..



మాధవపట్నంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో మాధవపట్నం వద్ద ట్రాఫిక్ జామ్ అయింది. మాధవపట్నం నుంచి సర్పవరం వెళ్లే రోడ్డులో రైల్వే గేటు వేసిన సమయంలో తరుచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీనిలో భాగంగా గురువారం ఉదయం గేటు వేయడంతో వాహనాలు కాకినాడ రోడ్డు వరకు బారులు తీరాయి. దాంతో సామర్లకోట-కాకినాడ రోడ్డులో వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. ఈ నేపథ్యంలో మాధవపట్నం బస్సు స్టాప్ వద్ద ఉన్న ఆటో యూనియన్ నాయకులు చొరవ తీసుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దాంతో సుమారు గంట పాటు వాహనాలు ట్రాఫిక్ చిక్కుకుని రోడ్డుకు ఇరువైపులా కిలో మీటరు మేర నిలిచిపోయాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఒక్కటే మార్గమని ఆ ప్రాంత ప్రజలు తెలియజేస్తున్నారు.